క్లుప్తంగా

జూలై 1నుంచి జగనన్న సురక్ష

చినగంజాం: జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలో జూలై 1వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు చేసినట్లు ఎంపీడీవో కే స్వరూపరాణి ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తేదీ కొత్తపాలెం, పల్లెపాలెం, 4న రాజుబంగారుపాలెం మున్నం వారిపాలెం, 7న సంతరావూరు, గొనసపూడి, 11న కడవకుదురు-1,2, 14న చినగంజాం 1,2, 18న పెదగంజాం 1,2, 21న మోటుపల్లిలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఇందులో భాగంగా రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్, ఈవోపీఆర్డీ ఒక బృందంగాను, ఎంపీడీవో, ఉప తహసీల్దార్‌లతో మరో బృందం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

వేటపాలెం వైద్యాధికారిగా శ్యాంసన్

వేటపాలెం: వేటపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా ఎస్ శ్యాంసన్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన గుంటూరు జిల్లా ఎడ్లపాడు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ ఎం. ప్రభాకర్‌రావు బదిలీపై గుంటూరు జిల్లా ఎడ్లపాడు వెళ్లారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రజలకు వైద్యశాల్లో అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు.

విద్యార్థినికి అభినందనలు

అద్దంకి రూరల్: అద్దంకిలో హర్షిణి కళాశాలకు చెందిన విద్యార్థివావిలాల గురుదత్త ఎంసీఏ ప్రవేశ పరీక్షలో జాతీయ స్థాయిలో 270వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి విద్యార్థిని సత్కరించి కళాశాల అధ్యాపకులు, యాజమాన్యానికి అభినందనాలు తెలిపారు. కార్యక్రమంలో కళాప్రిన్సిపల్ నరసింహారావు, జ్యోతి రమేష్‌బాబు పాల్గొన్నారు.

తొలి ఏకాదశికి ముస్తాబైన ఆలయాలు

బల్లికురవ: తొలి ఏకాదశి వేడుకలకు మండలంలోని ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. గురువారం ఏకాదశి సందర్భంగా కొండాయపాలెం, చెన్నుపల్లి, ముక్తేశ్వరం, సూరేపల్లి, కొమ్మినేనివారిపాలెం, కొప్పరపాడు, చిన అంబడిపూడి, కొణిదెన గ్రామాల్లోని ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ఆయా ఆలయాల్లో ఉదయం 5 గంటల నుంచే స్వామి అమ్మవార్ల దర్శనానికి ధర్మకర్తలు, దేవదాయశాఖ. అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

సమాజ సేవలో రోటరీ ముందంజ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రోటరీ సభ్యులు

ఇంకొల్లు (చినగంజాం): సేవా రంగంలో రోటరీ ఇంటర్నేషనల్ ముందుంటుందని రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ తాళ్ల రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల నందు రోటరీ క్లబ్ ఆర్థిక సహకారంతో పాఠశాలలో నిర్మాణం చేసిన టాయిలెట్స్, ఆర్వో ప్లాంట్‌లను ఆయన ప్రారంభించారు. చిలకలూరిపేట, పండరీపురం, మార్టూరు రోటరీ క్లబ్‌ల సహకారంతో పాఠశాలలో ఏర్పాటు చేయడంతో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులతో పాటు పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ బొగ్గవరపు చెంచుపున్నయ్య, గోరంట్ల పృథ్వీ, పాఠశాల హెచ్ఎం పిడవర్తి పేరిరెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన దుకాణాలు తనిఖీ

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలో గల విత్తన దుకాణాలను వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తహసీల్దార్ బీ.సుశీల బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వ్యవసాయ సీజను ఆరంభమవుతున్న సమయంలో డీలర్ సంతకంతో కూడిన రసీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. తనిఖీల్లో భాగంగా దేవిట్రేడర్స్‌లో రికార్డులను పరిశీలించారు.

- కొమ్మమూరుకు జలకళ
- జూన్‌లోనే పరవళ్లు తొక్కుతున్న కాలువ
- ఆనందంలో అన్నదాతలు



కారంచేడు వద్ద నిండుగా పారుతున్న కొమ్మమూరు కాలువ

తరలి వచ్చిన గంగ.. తీరిన బెంగ

కారంచేడు:

ఖరీఫ్ సీజన్‌లో వరుణ దేవుడు కొంతమేర మాత్రమే కరుణిస్తున్నాడు. ఇప్పటికే ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఈనెలలో 30 శాతం లోటు వర్షపాతం నమోదైంది. దీంతో రైతులు కొంచెం నిరాశ పడ్డారు. వ్యవసాయ పనులు ఆలస్యం అవుతాయేమోనని దిగాలు పడుతున్నారు. ఈతరుణంలో కొమ్మమూరు కాలువ రూపంలో గంగమ్మ తల్లి తరలివచ్చింది. ఈ ప్రాంత జలాశయంగా పేరొందిన కొమ్మమూరు కాలువలో జలకళ సంతరించుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా జూన్‌లోనే కాలువ 7 అడుగుల రీడింగ్‌తో పరవళ్లు తొక్కుతోంది. గత మూడు దశాబ్దాలుగా ఇలా పారుతున్న కాలువను చూడలేదని ఈ ప్రాంత అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ధాన్యాగారంగా పేరొందిన కారంచేడు ప్రాంత రైతన్నలు సాగుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలోని పర్చూరు, చీరాల, కారంచేడు, చినగంజాం, వేటపాలెం మండలాల్లోని అన్ని గ్రామాల పరిధిలో అధికారిక, అనధికారిక లెక్కల ప్రకారం సుమారు లక్ష ఎకరాలకు పైగా వరి సాగు ఈ కాలువ కిందనే సాగు అవుతోంది. సాగుతో పాటు, కారంచేడు, పర్చూరు, చినగంజాం మండలాల్లోని అన్ని తాగు నీటి చెరువులకు సైతం ఈకాలువ నీటినే వినియోగిస్తారు. కాలువకు సరైన రీడింగ్ లేకుంటే ఈ ప్రాంతంలోని పంట పొలాలన్నీ బీడు భూములుగా మారాల్సిందే.

రెండేళ్ల నుంచే జూన్‌లో నీరు..

గత రెండేళ్ల నుంచే ఈ కొమ్మమూరు కాలువకు సాగు, తాగునీటి అవసరాల కోసం నీటిని ప్రభుత్వం, నీటిపారుదల శాఖాధికారులు విడుదల చేస్తున్నారు. గత మూడు దశాబ్దాల క్రితం జూన్ నెలల్లోనే సాగునీటికి కాలువకు నీటిని ఇచ్చేవారని, కాలక్రమేణ కాలువ రాకపోడంతో ఈ ప్రాంతంలోని రైతులు ఆగస్టులో సాగుకు సిద్ధమయ్యేవారు. ఆగస్టులో నాట్లు వేసుకుంటే నవంబర్, డిసెంబర్ నెలల్లో వచ్చే ఆకాల వర్షాలు, తుఫాన్‌లు, ఎగువ నుంచి వచ్చే వరదలతో ఈ ప్రాంతంలోని పంట చేలు మొత్తం తుడిచిపెట్టుకుపోయేవి. రైతు సంఘాల విజ్ఞప్తితో జననేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో పులిచింతల, పోలవరం ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు.



కుంకలమర్రు రోడ్డులో యూటీ వద్ద 7 అడుగుల రీడింగ్ చూపుతున్న స్కేలు

పులిచింతలతో మహర్దశ..

దివంగతనేత డాక్టర్ వైఎస్సార్ ప్రారంభించిన పులిచింతల ప్రాజెక్టు నేడు ఎంతో ఉపయోగపడుతోంది. దీంతో ఎగువ నుంచి వచ్చే వరదలతో పాటు నాగార్జునసాగర్ విద్యుత్ ప్లాంట్ ద్వారా వచ్చే నీటిని పులిచింతల వద్ద నిల్వ చేసి ఆ నీటిని సాగు కోసం కాలువలకు వదులుతున్నారు. సుమారు 45 టీఎంసీల నీటి నిల్వల సామర్థ్యంతో ఉన్న పులిచింతల ప్రాజెక్టు ద్వారా ఆయకట్టు స్థిరీకరణకు సాధ్యమయ్యింది. దీంతో కృష్ణా డెల్టాకు సాగు, తాగు నీటిని విడుదలకు అవకాశం ఏర్పడింది. ఈ అవకాశం లేకుంటే సకాలంలో సాగునీరు అందక ఈ ప్రాంత రైతన్నలు చాలా ఇబ్బందులు పడేవారు. సాగునీరు అందక నాట్లు ఆలస్యంగా వేసుకోవాల్సి వచ్చేది. గతంలో చాలా సార్లు సాగు నీటిని ముందుగా విడుదల చేయాలని ఈ ప్రాంత రైతులు రోడ్లెక్కిన పరిస్థితులున్నాయి. పులిచింతల పుణ్యమా అని నేడు ఈ ప్రాంత రైతులు ముందుగానే వరి సాగును చేపట్టినట్లయితే తుఫానుల సమయానికి పంటలు చేతికంది ఎలాంటి నష్టాలు లేకుండానే తమ కష్టార్జితాన్ని ఇంటికి తెచ్చుకొనేందుకు వీలుంటుందని రైతులు చెబుతున్నారు. జూన్‌లోనే కొమ్మమూరు కాలువ పరవళ్లు తొక్కుతుండటంతో ఈ ప్రాంత రైతన్నలతో పాటు, తాగునీటి చెరువులకు నీటిని పెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. గ్రామాల ప్రజలు, అధికారులు, సర్పంచ్‌లు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న చొరవతో నెరవేరిన సొంతింటి కల



భూమిపూజ చేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: పేదల సొంతింటి కల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో నెరవేరిందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య పేర్కొన్నారు. బుధవారం అద్దంకిలోని జగనన్న కాలనీ వేలమూరిపాడు లేఅవుట్‌లో కాంట్రాక్ట్ ద్వారా నిర్మాణాలు చేపట్టేందుకు భూమిపూజ నిర్వహించి, బోర్ పాయింట్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ నవరత్నాల్లో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి నివేశన స్థలాల మంజూరుతో ఇళ్లు నిర్మించి ఇస్తున్నారన్నారు. ఇంటి నిర్మించుకోనే ఆర్థిక స్తోమత లేనివారికి కాంట్రాక్టర్‌లు పూర్తిచేసి ఇస్తారన్నారు. మిగిలిన పనులు వీలైన సమయంలో పూర్తిచేసు కోవచ్చాన్నారు. మూడు నెలల్లో ప్రతి ఒక్కరూ గృహప్రవేశాలు చేస్తారన్నారు. లబ్ధిదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అద్దంకి మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్ పద్మేష్, అనంతలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, కౌన్సిలర్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆస్తి విషయంలో కుమారుడిపై దాడి

అద్దంకి రూరల్: ఆస్తి విషయంలో తల్లి, చెల్లి, చిన్నమ్మ కలిసి కుమారుడిపై దాడిచేసిన ఘటన బుధవారం స్థానిక బత్తుల వారిపాలెంలో జరగగా క్షతగాత్రుడు వైద్యశాలలో చికిత్స పొందుతుండగా వైద్యశాల నుంచి వచ్చిన సమాచారంతో ఎస్సై అదిలక్ష్మీ గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. అద్దంకిలోని గుంజివారిపాలెంలో నివాసం ఉంటున్న వెంకటరావు బైక్ మెకానిక్‌గా పనిచేస్తుంటాడు ఈ నేపథ్యంలో తండ్రి వెంకటేశ్వర్లుతో ఆస్తి విషయంలో తల్లి, చిన్నమ్మ, చెల్లి గొడవ పడుతున్నారు. ఆదే సమయంలో వెంకటరావు ఇంటికి రావడంతో ఎంటి విషయం అని అడగటంతో వెంకటరావుపై దాడికి పాల్పడ్డారు. దీంతో వెంకటరావుకు గాయాలవటంతో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

సివిల్స్ ర్యాంకర్‌కు అభినందనలు

మార్టూరు: సివిల్స్ ఫలితాల్లో 311వ ర్యాంక్ సాధించిన మార్టూరుకు చెందిన వీర గంధం లక్ష్మీ సుజిత బుధవారం అధికారులు అభినందించారు. ఎంపీడీవో కే కృష్ణకుమారి మార్టూరులోని లక్ష్మీసుజిత నివాసంలో ఆమెకు పుష్పగుచ్ఛం అందించి భవిష్యత్తు తరాల వారికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ అభినందించారు. కార్యక్రమంలో మార్టూరు పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు జూనియర్ అసిస్టెంట్ హర్షకుమార్ బాపట్ల జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి గఢం మస్తాన్ వలి, లక్ష్మి సుజిత తల్లి దండ్రులు భవాని, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సుజితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీడీవో కృష్ణకుమారి

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుమారుడికి నగదు అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

వేటపాలెం: ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఫొటోగ్రాఫర్ కుటుంబానికి సహచర ఫొటోగ్రాఫర్‌లు అండగా నిలిచారు. ఈనెల 20న ఊటుకూరి సుబ్బయ్యపాలేనికి చెందిన ఫొటోగ్రాఫర్ పీ. అంజయ్య అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం అంజయ్య ఇంటికి వెళ్లి చిత్రపటానికి పూలు వేసి నివాళులరించి కుటుంబానికి సంతాపం తెలిపారు. మృతుడి కుమారుడు నాగబాబుకు రూ. 21 వేల నగదు ఆర్థిక సాయం అందజేశారు. అంజయ్య కుటుంబానికి అసోసియేషన్ తరపున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చీరాల క్షీరపురి ఛాయా చిత్ర వెల్ఫేర్ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ మల్లికార్జున, సెక్రటరీ ఆఫిద్, కోశాధికారి మస్తాన్ వలీ, అందె ప్రసాద్, కిషోర్, నేతాజీ, పోతు రాజు, రంగనాథ్, అరవింద్, శేషు, చింతం కోటివీరయ్య, రాజు, సుబ్బారావు, పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' పథకం పేదలకు వరం

బల్లికురవ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యాక్రమంపై వలంటీర్లు ఇంటింటా సర్వేను రెండు రోజుల్లో పూర్తిచేయాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. జులై 1 నుంచి 24వ తేదీ వరకు తాను తహసీల్దార్ కె. రవిబాబు రెండు టీమ్‌లుగా 20 సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని, అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తెలియజేయవచ్చని ఎంపీడీవో అన్నారు. కార్యక్రమంలో భాగంగా 11 రకాల సర్వీసులను ఎలాంటి యూజర్ చార్జీలు లేకుండా అర్హులకు అందిస్తామని కృష్ణ వివరించారు.

స్వర్ణ (కారంచేడు): రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష పథకంతో పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని, ఈ పథకం ప్రభుత్వం అందించే ఒక వరమని జేసీఎస్ కన్వీనర్ యార్లగడ్డ శ్రీకాంత్ అన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో పారదర్శకత

- శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య



లబ్ధిదారులతో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

మేదరమెట్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అవినీతి, లంచాలకు తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తోందని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలో మూడో రోజు బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లిన ఆయన ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ, మాజీ ఏఎంసీ వైస్‌చైర్మన్ కోయి అంకారావు, మాజీ సర్పంచ్ జజ్జర ఆనందరావు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలతో తాగునీటి కొరత



మాట్లాడుతున్న జెడ్పీటీసీ భాగ్యలక్ష్మి

చినగంజాం: మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక అక్రమంగా తవ్వి తరలించడంతో తాగునీటి కొరత ఏర్పడుతోందని, సమస్యను పరిష్కరించాలని చినగంజాం జెడ్పీటీసీ ఆసోది భాగ్యలక్ష్మి బుధవారం ఒంగోలు జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అన్నారు. మండలంలో సొన పోరంబోకు, ప్రకృతి పరంగా ఏర్పడిన ఇసుక మేటలను అక్రమార్కులు తరలించేస్తున్నారని, దాని కారణంగా నీటి వనరులు దెబ్బతినడంతో పాటు తాగునీరు ఉప్పు నీరుగా మారి ప్రజలకు తాగేందుకు నీరు లేకుండా పోతుందని ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులకు వినిపించారు. సమస్యపై స్పందించిన అధికారులు మూడు రోజుల్లో అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు.

మాజీ సర్పంచ్‌కు నివాళులు



వెంకటేశ్వర్లు మృతదేహానికి నివాళి అర్పిస్తున్న కృష్ణచైతన్య



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం

అద్దంకి: ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ మాజీ సర్పంచ్ తోకల వెంకటేశ్వర్లు కుటుంబాన్ని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య పరామర్శించారు. ఆయనతోపాటు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆయన కుమారుడు కొండలు, వైఎస్సార్‌సీపీ నాయకుడు తోలక వీరాంజనేయులుతో మాట్లాడి, కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సర్పంచ్‌గా సుదీర్ఘ కాలం పనిచేయడంతోపాటు, పనిచేసిన సమయంలో గ్రామాభివృద్ధి చేశారని కొనియాడారు.

కరణం నివాళి..

మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు మృతదేహాన్ని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సందర్శించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

మార్టూరు తహసీల్దార్‌గా సురేష్‌బాబు

మార్టూరు: మండల తహసీల్దార్‌గా పీ సురేష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల కలెక్టర్ కార్యాలయ డిటీగా ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించిన సురేష్‌బాబు ఉద్యోగోన్నతిపై తహసీల్దార్‌గా మార్టూరులో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది సురేష్‌బాబుకు అభినందనలు తెలిపారు.

ఎంఈవో బాధ్యతల స్వీకరణ

చీరాల అర్బన్: మండల విద్యాశాఖాధికారిగా సుబ్రహ్మణ్యేశ్వరరావు బుధవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. యద్దనపూడి మండల ఎంఈఓగా పనిచేస్తున్న ఆయనను ఎఫ్ఏసీ బాధ్యతలతో చీరాల మండల విద్యాశాఖాధికారిగా నియమించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో స్థానిక రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రోటరీ క్లబ్ తరఫున ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు 42 మందికి నూతన సైకిళ్లను పంపిణీ చేశారు. స్థానిక చెరువు బావి సమీపంలోని వెంకటేశ్వరస్వామి పాదాల చెంత రోటరీ సభ్యులు చెరుకూరి నాగేశ్వరరావు రూ.50 వేలు వ్యయంతో ఏర్పాటు చేసిన బోరను, మరో సభ్యుడు వేమూరి చిన్న అక్కడే రూ 3 లక్షల వ్యయంతో నిర్మించిన ఫ్లాట్‌ఫాం నిర్మాణాన్ని 3150 రోటరీ జిల్లా గవర్నర్ టీ రాజశేఖర్ రెడ్డి, అన్నె రత్నప్రభాకర్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు, కార్యదర్శి కే కాజారావు, వెంకటరామయ్య ఇతర ప్రతినిధులు జేవీ మోహనరావు, ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ



నోట్ పుస్తకాలు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ చీరాల ఆధ్వర్యంలో పట్టణంలోని వైకుంఠపురంలోని వి.పిచ్చయ్య ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో బుధవారం 1 నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న 100 మంది విద్యార్థులకు రూ.10,500లు విలువైన నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకొని అబ్దుల్ కలాం, అంబేడ్కర్‌లా ఎదగాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఐ.బాబూరావు, బాలవెంకటేశ్వరరావు, పి.రామకృష్ణ, మామిడాల శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా రెండు బైకులు ఢీ

అద్దంకి రూరల్: ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఈఘటన బుధవారం అద్దంకి పట్టణంలో రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. రేణింగవరం గ్రామానికి చెందిన రాయిని సిద్దయ్య, అద్దంకిలోని శ్రీనగర్‌కు చెందిన శ్రీనివాసరావులు బైకు మీద వస్తున్నారు. మరో గుర్తు తెలియని వ్యక్తి బైకు మీద అద్దంకి-నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై నున్న ద్వారకా నగర్ వద్ద మలుపు వద్దకు రాగానే రెండు బైకులు ఢీకొన్నాయి. సిద్దయ్య, శ్రీనివాసరావులకు తీవ్ర గాయాలయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తి శింగరకొండ వైపు వెళ్లాడు. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు.

సెయింట్ ఆన్స్ కాలేజీకి అవార్డు



సుకన్యని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్‌పీటీఈఎల్‌చే యాక్టివ్ ఎస్‌పీవోసీ అవార్డు సాధించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణరావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు బుధవారం తెలిపారు. చెన్నైకి చెందిన స్వయం ఎన్‌పీటీఈఎల్ మినిస్ట్రి ఆఫ్ యుమన్ రిసోర్స్ అండ్ డెవలప్మెంట్ ఇండియన్ ఇనిస్టిట్యూల్ ఆఫ్ టెక్నాలజీ సంస్థ ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించిందన్నారు. 2023 మధ్యకాలంలో నిర్వహించిన పరీక్షల్లో కళాశాలకి చెందిన 302 మంది విద్యార్థులు సాధించి సర్టిఫికెట్లు పొందారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు తెలిపారు. గోల్డ్ మెడల్ ఐదుగురు, 32 మంది సిల్వర్, 125 మంది ఎలైట్ మెడల్స్‌తో పాటు 144 మంది సర్టిఫికెట్లు సాధించారని తెలిపారు. పరీక్షల్లో స్పెషల్ విభాగంలో విద్యార్థి షేక్ జమీర్ బాషా మూడు కోర్సుల్లో టాపర్‌గా నిలిచి ఎన్‌పీటీఈఎల్ సూపర్ స్టార్ అవార్డు అందుకున్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎస్సైకి గాయాలు

బల్లికురవ: వాకింగ్ చేస్తున్న బల్లికురవ పోలీస్ స్టేషన్ ఏఎస్సై సీ. బాలకృష్ణ గాయాలపాలయ్యారు. ఈ ఘటన బుధవారం సాయంత్రం బల్లికురవ-కొమ్మాలపాడు ఆర్అండ్‌బీ రోడ్‌లో జరిగింది. అందిన సమాచారం ప్రకారం ఏఎస్సై విధులు ముగించుకుని బల్లికురవ నుంచి కొమ్మాలపాడు రోడ్డులో చెన్నుపల్లి వరకు వాకింగ్‌కు వెళ్తున్నారు. వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టటంతో కాళ్లు, చేతులు, తలకు గాయాలయ్యాయి. స్థానికులు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటనా ప్రదేశానికి హుటాహుటిన వచ్చిన సిబ్బంది. చికిత్స నిమిత్తం ఒంగోలు కిమ్స్‌కు తరలించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామం 12వ వార్డులో పలు అభివృద్ధి పనుల కోసం బుధవారం శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పాల్గొన్నారు. సీసీ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం జగనన్న ప్రభుత్వం పనిచేస్తుందని అందులో భాగంగానే గ్రామంలో పలు అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసన్నకుమారి, సర్పంచ్ ఎలీశమ్మ, స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.